సాక్షి
వనపర్తి
మంగళవారం । 13 । మే । 2025



స్లాట్ బుకింగ్ సేవలు
పేట, కల్వకుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలు మొదలయ్యాయి.
వివరాలు 8లో ▸



కనులపండువగా..
మన్యంకొండ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం సోమవారం కనులపండువగా నిర్వహించారు.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
40.3 /26.8
మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. అప్పుడప్పుడు వేడి గాలులు వీయడంతో పాటు ఆకాశం మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు



పాన్‌గల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని జిల్లా సహకార అధికారి (డీసీఓ) రాణి ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాల కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రాల వద్ద నీడ, తాగునీటి వసతి కల్పించాలని, తేమశాతం, సన్న, దొడ్డురకం ధాన్యం గుర్తింపునకు యంత్రాలు, రైతుల వివరాల రికార్డు తప్పక ఉండాలన్నారు. అలాగే తాలు, చెత్త లేకుండా చూసి ధాన్యం తూకం చేయాలని, సేకరణలో జాప్యం చేయొద్దని.. ఆలస్యం జరిగితే కారణాలను రైతులకు వివరించాలని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలిగించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తాలు పేరుతో తరుగు, ధాన్యం తరలింపునకు లారీలు రాక కేంద్రాల్లో నిల్వలు పేరుకుపోయి ఇబ్బందులు పడుతున్నామని, అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతుందని పలువురు రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఏడీఏ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, సీనియర్ ఆడిటర్ బీక్యానాయక్, మహబూబ్‌అలీ, కిరణ్, రాజునాయక్, ఏఓలు రాజవర్ధన్‌రెడ్డి, దాకేశ్వర్‌గౌడ్, మురళీధర్, సీఈఓ భాస్కర్‌గౌడ్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

వనపర్తి టౌన్: జిల్లాలోని నిరుద్యోగులకు వనపర్తి, హైదరాబాద్‌లో శిక్షణనిచ్చి ఉపాధి కల్పించేందుకుగాను జిల్లా ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యంలో పీఎంకేకే సహకారంతో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని పీఎంకేకేలో జరిగే జాబ్ మేళాకు 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉండి పది, ఐటీఐ, ఏదైన డిగ్రీ, బీ-ఫార్మసీ, ఎం-ఫార్మసీ చదివిన వారు అర్హులని.. ఎంపికైన వారికి శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు అన్ని ధ్రువపత్రాలతో జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్‌నంబర్లు 99485 68830, 77990 73053, 91753 05435 సంప్రదించాలన్నారు.

15, 16న విద్యార్థులకు స్పాట్ కౌన్సెలింగ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం (2025- 26)లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు గాను ఈ నెల 15, 16 తేదీల్లో విద్యార్థులకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గురుకులాల మహబూబ్‌నగర్ ప్రాంతీయ సమన్వయ అధికారి కె.సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, కల్వకుర్తి, వనపర్తి, కేటీదొడ్డి, అచ్చంపేట, మన్ననూర్, పెద్దమందడి, కొండాపూర్‌లో ఈ కళాశాలలు ఉన్నాయన్నారు. వీటిలో చేరేవారు మొదటి రోజు బాలురకు, రెండో రోజు బాలికలకు జిల్లాకేంద్రం శివారు ధర్మాపూర్‌లోని ఆల్ మదీనా బీఈడీ కళాశాల ప్రాంగణంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

వైద్యం.. దైన్యం!



ఈ నెల 7న శ్రీరంగాపురం మండల కేంద్రంలో ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

- ప్రథమ చికిత్స కేంద్రాల్లో అర్హతకు మించి వైద్యం.. నిబంధనలు పాటించని ఆస్పత్రులు
- రెండు నెలల్లో 8 ఆర్ఎంపీలు, 2 నర్సింగ్ హోంలు సీజ్ చేసిన వైద్యాధికారులు
- ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో కనిపించని ఫీజు వివరాల బోర్డులు
- అబార్షన్లకు అడ్డాలుగా ప్రథమ చికిత్స కేంద్రాలు ?

వనపర్తి: జిల్లాలోని ప్రథమచికిత్స కేంద్రాల్లో ఆర్ఎంపీలు అర్హతకు మించి వైద్యసేవలు అందిస్తున్న ఘటనలు ఇటీవల వెలుగు చూస్తున్నాయి. జిల్లా వైద్యాధికారులు రెండునెలల వ్యవధిలో ఫిర్యాదులు అందిన చోట్ల తనిఖీలు చేసి సీజ్ చేసిన ప్రథమ చికిత్స కేంద్రాలు ఎనిమిదికి పైగా ఉన్నాయి. అలాగే నిబంధనలు పాటించని రెండు పాలి క్లినిక్‌లను కూడా సీజ్ చేశారు. పవిత్రమైన వైద్య వృత్తిని డబ్బు సంపాదనే ధ్యేయంగా అన్నట్లు ప్రథమ చికిత్స కేంద్రాలు, ప్రైవేట్ ఆస్పత్రులను ఏర్పాటు చేసుకొని ప్రజల భయాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా సోమవారం జిల్లాకేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఐవీ, రెఫరల్ లెటర్ ప్యాడ్స్, మందులు నిల్వ చేసిన రెండు ప్రథమ చికిత్సా కేంద్రాలను సీజ్ చేశారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్యశాఖ అధికారులకు పూర్తి స్వేచ్ఛనివ్వడంతో సమాచారం అందగానే తనిఖీలు చేసి సీజ్ చేస్తున్నట్లు సమాచారం.

నిబంధనలకు తిలోదకాలు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో ఫీజు వివరాలను విధిగా బోర్డుపై రాసి ఉంచాలి. కాని చాలా వాటిలో బోర్డులు ఏర్పాటు చేయకుండా ఇష్టానుసారంగా డబ్బులు దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయి.

అక్రమార్జనే లక్ష్యంగా..

కొన్ని ప్రథమ చికిత్సా కేంద్రాలు అబార్షన్లకు అడ్డాలుగా మారాయనే ఆరోపణలు జిల్లావ్యాప్తంగా గుప్పుమంటున్నాయి. ముఖ్యంగా పెబ్బేరు, శ్రీరంగాపురం, గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల, కొత్తకోట మండలాల్లో ఎక్కువగా అబార్షన్లు చేస్తున్నట్లు సమాచారం. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఉదాసీనంగా ఉండటంతోనే ఆర్ఎంపీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో అబార్షన్‌కు రూ.20 వేలకు పైగా వసూలు చేస్తున్నారని సమాచారం. అలాగే ప్రథమ చికిత్స కేంద్రాల్లో బెడ్లను ఏర్పాటు చేసి రోగులను చేర్చుకుంటున్న ఆర్ఎంపీలు ఉన్నారు. ఎక్కడైనా ప్రాణనష్టం జరిగితేగాని వైద్యశాఖలో చలన రావటం లేదనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు..



అర్హతకు మించి వైద్యం అందించడం, ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేయడం, అనుమతి లేకుండా మందులు విక్రయించడం వంటివి ఎక్కడ కనిపించినా సమాచారం ఇవ్వండి. మీ వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం. కొందరు ఆర్ఎంపీలు అబార్షన్లు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలకు సిద్ధమవుతాం.
– డా. శ్రీనివాసులు, జిల్లా వైద్యాధికారి

ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం



ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, యాదయ్యతో కలిసి కలెక్టర్ అర్జీదారులతో వినతులు స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఫిర్యాదుదారులకు తగిన సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రి ద్వారా వచ్చిన వినతులతో పాటు జిల్లా ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం భోజన విరామ సమయం వరకు జరిగిన ప్రజావాణికి మొత్తం 66 వినతులు వచ్చినట్లు కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ప్రజావాణిలో డీఆర్డీఓ ఉమాదేవి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ప్రజావాణికి 7..



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి 7 వినతులు వచ్చాయి. ఎస్పీ రావుల గిరిధర్ ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులను ఆదేశించారు.

ఆత్మహత్యయత్నం..

జిల్లాకేంద్రంలోని బుడగజంగాలకాలనీకి చెందిన ఎస్.శంకర్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఎస్పీ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ఒంటిపై పెట్రోలు పోసుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తల్లిదండ్రులు సంపాదించిన ప్లాట్లు, ఇల్లు పంపకంలో పెద్ద మనుషుల పేరుతో జోక్యం చేసుకున్న తాజా మాజీ కౌన్సిలర్ ధౌర్జన్యానికి పాల్పడుతున్నారని.. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని తెలిపారు. గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు అప్రమత్తమై వారిని నిలువరించారు. అనంతరం బాధితుడిని ఎస్పీ వద్దకు తీసుకెళ్లగా తనకు జరిగిన అన్యాయం, పంపకాల పేరుతో తన వద్ద తీసుకున్న డబ్బుల వివరాలతో ఫిర్యాదు అందించారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి

గోపాల్‌పేట: రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి కోరారు. సోమవారం మండలంలోని మున్ననూరులో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యూరియా, పురుగు మందులను తగిన మోతాదులో వినియోగించాలని సూచించారు. అనంతరం శాస్త్రవేత్తలు భూసార పరీక్షలతో కలిగే లాభాలు, పంట అవశేషాలను కాల్చడంతో కలిగే నష్టాలను వివరించారు. సాగు సమయంలో విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని, అలాగే పంటమార్పిడి చేపట్టాలని సూచించారు. తక్కువ నీటితో పంటల సాగు, ఆయిల్‌పాం సాగు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, కరుణశ్రీ, హరీశ్‌నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

వనపర్తి టౌన్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సోమవారం జిల్లాకేంద్రంలోని తన స్వగృహంలో 68 మంది లబ్ధిదారులకు రూ.34.03 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అత్యవసర వైద్యసేవలు పొందిన పేదలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా మత్స్యకార సెల్ అధ్యక్షుడు నందిమళ్ల యాదయ్య, పెద్దమందడి మండల అధ్యక్షుడు సి.పెంటన్న, నారాయణ, జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, పట్టణ ప్రధానకార్యదర్శి అడ్వొకేట్ బాబా, నాయకులు ఎత్తం చరణ్, రాగి వేణు, కోళ్ల వెంకటేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, అబ్దుల్లా, జానంపేట నాగరాజు, అనీష్, గోవర్ధన్, గట్టు రాజు, సొప్పరి రమేష్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలి

వనపర్తి: విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్ కోసం ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా ముందుకుసాగాలని ఎస్పీ రావుల గిరిధర్ కోరారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పది, ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు సాయి శరణ్య, శ్రీచరణ్, భార్గవి, అమూల్యశ్రీని ఎస్పీ శాలువాలతో సన్మానించి మాట్లాడారు. విద్యార్థుల కృషికి తల్లిదండ్రుల ప్రోత్సాహం చాలా అవసరమని, పిల్లలు సంస్కారాన్ని పెంపొందించుకొని జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. విశ్వకర్మ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మారోజు తిరుపతయ్య, యాదగిరి, గౌరవ అధ్యక్షులు బైరోజు చంద్రశేఖర్, సూర్యనారాయణ, మాజీ కౌన్సిలర్ బ్రహ్మచారి, డా. బి.శ్యాంసుందర్, అరవింద్, ప్రకాష్, రామ్మోహన్, శ్రీనివాసాచారి, శ్రీశైలం పాల్గొన్నారు.

అందని బోనస్



5 రోజులు గడిచినా జమ కాని రూ.500 ప్రోత్సాహకం

- ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మంజూరు కాని నిధులు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.11.36 కోట్లు పెండింగ్
- ఉన్నతాధికారుల మాటలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు
- సన్నరకం వరి రైతులకు తప్పని ఎదురుచూపులు

సాక్షి ఫోకస్

సాక్షి, నాగర్‌కర్నూల్: వరిలో సన్నరకం పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అదనంగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో అత్యధిక మంది సన్నాల సాగుకే మొగ్గుచూపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు పెద్దఎత్తున సన్నరకం ధాన్యం వస్తోంది. అయితే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి వారం, పది రోజులు గడుస్తున్నా బోనస్ డబ్బులు మాత్రం వారి బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 2.28 లక్షల క్వింటాళ్ల సన్నాలు సేకరించగా ఇందుకు సంబంధించి రూ.11.36 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీంతో ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ డబ్బులు ఎప్పుడు ఖాతాల్లో పడతాయోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

15 రోజులు గడిచినా..

వాస్తవానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని తేమ శాతం చూశాక నిర్వాహకులు కొనుగోలు చేస్తారు. నిర్ణీత తేమ శాతం వచ్చే వరకు కేంద్రాల్లోనే ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచిస్తున్నారు. ఇందుకు కనీసం వారం రోజుల సమయం పడుతోంది. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత కేవలం రెండు రోజుల్లోనే పూర్తిస్థాయిలో ధాన్యం డబ్బులు రైతుల ఖాతాలో పడుతాయని ప్రభుత్వం చెబుతోంది. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. ధాన్యం కొనుగోలు చేసి 15 రోజులైనా బోనస్ డబ్బులు మాత్రం పడటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి బోనస్ అమలు చేస్తుందా.. లేదా.. అని అయోమయానికి గురవుతున్నారు.

పెరిగిన సన్నాల సాగు..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సన్నరకం వరి సాగు భారీగా పెరిగింది. సాధారణంగా ఇక్కడి రైతులు వానాకాలం సీజన్‌లో సన్నాలు, యాసంగిలో దొడ్డు రకం పండిస్తారు. అయితే ప్రభుత్వం సన్నాలకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రకటించడంతో యాసంగి సీజన్‌లోనూ రైతులు సన్నాల సాగుకే మొగ్గు చూపుతున్నారు. నారాయణపేట జిల్లాలో ఇప్పటి వరకు 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, ఇందులో ఏకంగా 86,369 మెట్రిక్ టన్నులు సన్నాలే కావడం గమనార్హం. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లోనూ ఇప్పటి వరకు దొడ్డు రకం కంటే.. సన్నాలే ఎక్కువగా కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. అయితే కేవలం రెండు రోజుల్లోనే రైతులకు పూర్తి స్థాయిలో ధాన్యం డబ్బులు పడుతాయని అధికారులు చెబుతున్నా ఎక్కడా అమలు కావడం లేదు. కనీస మద్దతు ధర ప్రకారం ధాన్యం డబ్బులు జమయ్యేందుకు కనీసం వారం రోజులు పడుతుండగా, రూ.500 చొప్పున ప్రభుత్వం ఇచ్చే బోనస్ డబ్బులు 15 రోజులు దాటినా పడటం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి సకాలంలో బోనస్ డబ్బులు ఖాతాల్లో జమచేయాలని వేడుకుంటున్నారు.

జిల్లాల వారీగా ధాన్యం సేకరణ ఇలా..

జిల్లా	కేంద్రాలు	సే. స.ర. ధాన్యం (క్వింటాళ్లు)	రావాల్సిన బోనస్ (రూ.కోట్లు)
నారాయణపేట	101	86,369	4.31
మహబూబ్‌నగర్	193	59,785	2.98
వనపర్తి	255	53,998	2.69
నాగర్‌కర్నూల్	231	15,321	0.76
జోగుళాంబ గద్వాల	75	12,542	0.62

సే. స.ర. : సేకరించిన సన్న రకం ధాన్యం

ధాన్యం డబ్బులు, బోనస్ రెండూ రాలే..



నేను 14 ఎకరాల్లో వరి పంట సాగుచేశాను. ఎకరాకి 28 క్వింటాళ్ల చొప్పున ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ నెల 3వ తేదీన ధాన్యం విక్రయించాను. కానీ, ఇప్పటివరకు ధాన్యం డబ్బులే రాలేదు. ఇక బోనస్ ఎప్పుడు వేస్తారో తెల్వదు. ఇదే విషయమై అధికారులను అడిగితే డబ్బులు రావడానికి ప్రాసెస్ జరుగుతుందని చెప్పారు. అవి వచ్చాక బోనస్ వస్తదేమో చూడాలి.
– శేఖరెడ్డి, రైతు, చెన్నూరు గ్రామం, గోపాల్‌పేట, వనపర్తి జిల్లా

ఎప్పుడు వేస్తారో..



యాసంగిలో 22 క్వింటాళ్ల 80 కిలోల సన్న వడ్లు వచ్చాయి. ఈ వడ్లను ఐకేపీ సెంటర్ వాళ్లకు విక్రయించా. నా బ్యాంకు ఖాతాలో రూ.52,896 పడినవి. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. నాకైతే పడలేదు. ఇదే విషయమై సారోళ్లని అడిగితే.. తర్వాత వస్తాయని చెబుతున్నారు. ఎప్పుడు వస్తాయో తెలియడం లేదు.
– బంగి రామకృష్ణ అప్పారెడ్డిపల్లి, ఖిల్లా ఘనపురం మండలం

ప్రభుత్వం నుంచే రావాలి..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. క్వింటాల్‌కు కనీస మద్దతు ధర ప్రకారం రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. సన్న రకం ధాన్యానికి ఇచ్చే బోనస్ మరుసటి రోజునే ప్రభుత్వం జమ చేస్తుంది. బోనస్ డబ్బులు ప్రభు త్వం నుంచి విడుదల కావాల్సి ఉంది.
– రాజేందర్, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల శాఖ, నాగర్‌కర్నూల్

మత్తు రహిత జిల్లాగా మారుద్దాం



అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తదితరులు

వనపర్తి: జిల్లాను మత్తు రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో జరిగిన జిల్లాస్థాయి నార్కోటిక్, నషా ముక్త్ భారత్ సమీక్షలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించాలని, విద్యాశాఖ అధికారులతో పాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు గట్టి నిఘా ఉంచి మత్తు పదార్థాల విక్రయం, రవాణాను అరికట్టాలని కోరారు. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన గంజాయి వినియోగం రానురాను గ్రామీణ ప్రాంతాలకు పాకుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదయ్య మాట్లాడుతూ.. పిల్లలు మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, నిఘా ఉంచాలని కోరారు. విద్యాలయాలు, ఆస్పత్రులకు 100 మీటర్ల పరిధిలో పాన్, గుట్కా, సిగరెట్ వంటివి అమ్మకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పెషల్ క్యాంపెయిన్‌లు నిర్వహించి యువతకు అవగాహన కల్పించాలని, అదేవిధంగా పాఠశాలలు, కళాశాలల ఆవరణలో మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని జిల్లా సంక్షేమశాఖ అధికారిని ఆదేశించారు. డీసీఆర్బీ డీఎస్పీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లాలో 2017 నుంచి గంజాయి కేసులు నమోదవుతున్నాయని, ఇటీవల వీపనగండ్ల మండలంలో ఓ పశువుల కాపరి గడ్డివాములో గంజాయి దాచిన ఉదంతం వెలుగు చూసిందని తెలిపారు. అనంతరం మత్తు రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, డీఆర్డీఓ ఉమాదేవి, ఆబ్కారీ, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ సెలక్షన్స్

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-19, 23 విభాగాలకు ఈ సెలక్షన్స్ ఉంటాయన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి రోడ్డులోగల ఎండీసీఏ క్రికెట్ మైదానంలో, జడ్చర్లలోని మినీ స్టేడియంలో, 15న నారాయణపేటలోని మినీ స్టేడియంలో, నాగర్‌కర్నూల్‌లోని నల్లవెల్లి రోడ్డులోగల క్రికెట్ అకాడమీలో, 16న వనపర్తి జిల్లా పెబ్బేరులోని పీపీఎల్ మున్సిపల్ గ్రౌండ్‌లో, గద్వాలలోని ఇండోర్ స్టేడియంలో క్రికెట్ క్రీడాకారుల సెలక్షన్స్ ఉంటాయని చెప్పారు. ఎంపికైన క్రీడా జట్లతో ఈ నెల 19 నుంచి ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తామన్నారు. హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్లకు శ్రీకారం చుట్టిందని, పోటీల్లో గ్రామీణ క్రీడాకారులు తమ ప్రతిభచాటాలని పిలుపునిచ్చారు. క్రికెట్ సెలక్షన్స్‌కు సంబంధించి మిగతా వివరాల కోసం మహబూబ్‌నగర్‌లో సంతోష్ (81792 75867), నాగర్‌కర్నూల్‌లో సతీష్ (89193 86105), జడ్చర్లలో మహేష్ (99494 84723), గద్వాలలో శ్రీనివాసులు (98859 55633), నారాయణపేటలో రమణ (91007 53683), పెబ్బేర్‌లో శంకర్ (96033 60654) నంబర్లను సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

గోడ కూలి వ్యక్తి మృతి


మృతి చెందిన ఏబేలు

గట్టు: మండల పరిధిలోని బల్గెర గ్రామంలో ఇంటి నిర్మాణంలో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న గోడ కూలి పోవడంతో సంక ఏబేలు (38) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాలు మేరకు.. బల్గెరకు చెందిన సంక ఏబేలు అదే గ్రామానికి చెందిన బోయ నర్సింహులుకు చెందిన ఇంటి నిర్మాణ పనులకు వెళ్లాడు. పాత గోడపై కొత్తగా ఇటుక పెల్లతో నిర్మాణం చేస్తున్న క్రమంలో గోడ ఒక్కసారిగా కూలిపోయింది. ఏబేలు (38) తీవ్రంగా గాయపడగా అయిజలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య సువార్తమ్మతో పాటుగా ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. మృతుని తండ్రి సంక దేవదాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

అచ్చంపేట రూరల్: అనుమానస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొత్త తాండలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఐనోల్ గ్రామం కొత్తతాండకు చెందిన మాయని శ్రీశైలం (36) శ్రీశైలం మద్దిమడుగు ప్రాంతాల్లో పనులు చేసుకుంటూ జీవించేవాడు. మద్యానికి బానిస కావడంతో మొదటి భార్య రజిత విడిగా ఉంటుంది. ఈ క్రమంలో శ్రీశైలం మద్దిమడుగుకు చెందిన విజయలక్ష్మిని రెండో వివాహం చేసుకోగా వీరికి ఐదు నెలల పాప ఉంది. ఈనెల 11న శ్రీశైలం తల్లి వెంకటమ్మ కుమారుడి ఇంటికి వెళ్లింది. అయితే ఇంటి నుంచి దుర్వాసన రావడంతో అనుమానం వచ్చి ఇరుగు పొరుగు వారిని పిలిచింది. ఇంటి తలుపు పగులగొట్టి చూడగా శ్రీశైలం తీవ్ర రక్తగాయాలతో చనిపోయి ఉన్నాడు. భార్య కూడా కనిపించకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యా దు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దాపూర్ ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ధని యాప్ పేరుతో రూ.4.12 లక్షల మోసం

ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల గ్రామానికి చెందిన కుర్వ మహేష్ ధని యాప్ పేరిట ఆన్‌లైన్‌లో 4 విడతల్లో అకౌంట్‌లోకి రూ.4,12,884 నగదు పంపించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కలుగోట్ల గ్రామానికి చెందిన కుర్వ మహేష్‌కు ఫేస్‌బుక్‌లో మార్చి 31న ఆన్‌లైన్‌లో ధని యాప్ ద్వారా లోన్ ఇస్తామని రావడంతో వెంటనే క్లిక్ చేశారు. అదే యాప్ ద్వారా ఏప్రిల్ 1న మరొక వ్యక్తి ఫోన్ చేసి లోన్ ప్రాసెస్ గురించి వివరించాడు. దీంతో ప్రాసెసింగ్ ఫీజు కింద ఒకసారి రూ.2 వేలు, మరోసారి రూ. 10 వేలను ఆన్‌లైన్‌లో చెల్లించాడు. ఏప్రిల్ 3న మరో అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి ఎంత భూమి ఉందని అడగడంతో 2 ఎకరాలు ఉందని మహేష్ తెలిపాడు. దీంతో అపరిచిత వ్యక్తి రూ.80 లక్షల లోన్ వస్తుందని, రిజిస్ట్రేషన్‌కు ఫీజు చెల్లించాలని తెలపడంతో మొత్తం రూ.26,789 నగదును ఆన్‌లైన్ పేమెంట్ చేసినట్లు వెల్లడించారు. అలా వివిధ అకౌంట్లకు మొత్తం నాలుగు విడుతలలో రూ.4,12,884ను ఆన్‌లైన్‌లో చెల్లించాడు. మరుసటి రోజు తనకు కాల్స్ వచ్చిన నంబర్లకు తిరిగి ఫోన్ చేయడంతో స్విచ్చాఫ్ అని రావడంతో.. తాను మోసపోయానని గ్రహించిన మహేష్ ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సైబర్‌క్రైం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

బాధిత కుటుంబీకుల ఆందోళన


పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన బాధిత కుటుంబ సభ్యులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని కావేరమ్మపేటలో విద్యుదాఘాతంతో మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం మృతుల కుటుంబీకులు, గ్రామస్తులు స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఒక్కో కుటుంబానికి రూ. 20లక్షల పరిహారంతో పాటు ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముందుగా ఈ విషయమై విద్యుత్ అధికారులు, సదరు కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపారు. కాంట్రాక్టర్ ఒక్కో కుటుంబానికి రూ. 5లక్షల పరిహారం ఇచ్చేందుకు ముందుకు రాగా.. కనీసం రూ. 20లక్షల చొప్పున ఇవ్వాలని బాధిత కుటుంబ సభ్యులు పట్టుబట్టారు. పోలీస్‌స్టేషన్‌లో గంటల తరబడి చర్చలు జరిగినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆందోళనకారులు 167వ నంబర్ జాతీయ రహదారిపై బైఠాయించారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ నినదించారు. ఘటనకు కారణమైన లైన్‌మెన్ నిర్లక్ష్యాన్ని తప్పుపట్టారు. విషయాన్ని కొందరు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి ఫోన్ ద్వారా వివరించారు. అయితే ఎమ్మెల్యే చొరవతో ఒక్కో కుటుంబానికి రూ. 15లక్షలు ఇచ్చేలా కాంట్రాక్టర్, లైన్‌మెన్ అంగీకరించారు. అదే విధంగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేలా చూస్తామన్నారు. దీంతో ఆందోళన విరమించారు.

కనులపండువగా.. శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం


మంగళసూత్రాన్ని చూయిస్తున్న ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్

- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- వైభవంగా గరుడవాహన సేవ
- స్వామివారి నామస్మరణతో మార్మోగిన మన్యంకొండ

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం మధ్యాహ్నం అంగరంగ వైభవంగా జరిగింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తుల మధ్య స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ముందుగా సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన శేషవాహనంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవతామూర్తులను ఉంచి దేవస్థానంలోని గర్భగుడి నుంచి పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాల మధ్య ఊరేగిస్తూ ఆలయం ముందు గల మైదానంలో పూల అలంకరణతో తయారు చేసిన మండపం వద్దకు తీసుకొచ్చారు. భక్తుల హరినామస్మరణ మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది. కల్యాణోత్సవం సందర్భంగా మామిడి తోరణాలు, వివిధ రకాల పూలు, శోభాయమానంగా అలంకరించిన కల్యాణ మండపంలో ప్రత్యేక పూజలు జరిపారు. కల్యాణ తంతులో భాగంగా జీలకర్ర బెల్లం తదితర పూజల అనంతరం అమ్మవారికి మంగళసూత్రధారణ గావించారు. పురోహితుల వేదమంత్రాల మధ్య జరిగిన ఈ పవిత్ర ఘట్టాన్ని చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. అనంతరం శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవతామూర్తులకు పట్టువస్త్రధారణ, తలంబ్రాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ బంగారు, వెండి ఆభరణాలు, రకరకాల పూల మధ్య దేవతామూర్తుల దంపతులు ధగధగా మెరిసిపోతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఈ వేడుకలను కనులారా తిలకించి పునీతులయ్యారు. చాలామంది దేవతామూర్తుల మీద వేసిన తలంబ్రాలను తీసుకోవడానికి పోటీ పడ్డారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు దేవస్థానం తరఫున వారి చేతులకు పసుపు కొమ్ములను ధరింపచేశారు. కల్యాణోత్సవం అనంతరం ఈ దేవతామూర్తులను శేషవాహనంలో మళ్లీ కల్యాణ మండపం నుంచి గర్భగుడిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ ఉత్సవాలకు హాజరైన భక్తులు చాలా మంది దేవస్థానంలో కూడా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా గరుడవాహన సేవ

శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి స్వామివారి గరుడ వాహన సేవ నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన గరుడవాహనంపై స్వామి దంపతులను ఉంచి ఊరేగించారు. గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న కమాన్ వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. భక్తుల హరినామస్మరణ, పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. స్వర్ణాభరణ అలంకరణలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవతా మూర్తులు గరుడవాహనంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. ఈ పవిత్రసేవను చూసి భక్తులు తరించారు. స్వామివారి నామస్మరణతో మన్యంకొండ గిరులు మార్మోగాయి. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, మన్యంకొండ దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, పాలక మండలి సభ్యులు వెంకటాచారి, శంకర్, గోవింద్, ఆంజనేయులు, అలివేలు, మాజీ సర్పంచ్ మాధవ రెడ్డి, రవీందర్, రంగయ్య, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం, శేషవాహనంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవతామూర్తుల ఊరేగింపు

బీచుపల్లి క్షేత్రం.. భక్తజన సంద్రం


అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తజనం

- వైభవంగా అభయాంజనేయస్వామి రథోత్సవం
- మార్మోగిన అంజన్న నామస్మరణ
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం


సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు


పల్లకీసేవ చేస్తున్న పూజారులు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి క్షేత్రంలో ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమాల్లో వేలాది భక్తజనం పాల్గొనగా.. బీచుపల్లి క్షేత్రమంతా అంజన్న నామస్మరణతో మార్మోగింది. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు అభయాంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి.. పంచామృతాభిషేకం, వ్యాసపూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన సీతారాముల కల్యాణ వేడుకను భక్తులు కనులారా తిలకించి తన్మయం చెందారు. అనంతరం బలిహరణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం రథంగా హోమం, రాత్రికి కుంభం పూజలు చేశారు. అనంతరం వేలాది భక్తజనం నడుమ అంజన్న రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. అంతకుముందు దక్షిణవాహినిగా పేరుగాంచిన పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి.. అభయాంజనేయస్వామి దర్శనానికి బారులు దీరారు. పలువురు భక్తులు స్వామివారికి దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ పరిసర ప్రాంతాల్లో మిఠాయి, బొమ్మలు, గాజుల దుకాణాలు సందడిగా కనిపించాయి. కార్యక్రమంలో ఆలయ ఇఓ రామన్‌గౌడ్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం


అలంపూర్ క్షేత్రంలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి పాపిరెడ్డి

అలంపూర్: పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం చండీ హోమాలు నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయాలను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జరిగిన చండీ హోమాల్లో 96 మంది భక్తులు పాల్గొనట్లు ఆలయ ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు.

■ అలంపూర్ క్షేత్రాన్ని మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి పాపిరెడ్డి కుటుంబ సమేతంగా సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి.. స్వామి, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా స్థానిక జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి మిథున్ తేజ ఉన్నారు.

మరో రెండింటిలోనూ స్లాట్ బుకింగ్ సేవలు


కల్వకుర్తి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ దస్తావేజులను అందజేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ రవీందర్

మెట్టుగడ్డ: రాష్ట్రవ్యాప్తంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలను గత ఏప్రిల్ 10న పైలెట్ ప్రాజెక్టు కింద ప్రారంభించగా.. అందులో ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్న విషయం విదితమే. అయితే రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం స్లాట్ బుకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అందులో నారాయణపేట, కల్వకుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. కల్వకుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభమైన స్లాట్ బుకింగ్ సేవలను జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల అధికారి వి.రవీందర్ పరిశీలించారు. రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుకింగ్ చేసుకునే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వేగవంతంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అదే విధంగా స్లాట్ బుకింగ్ సేవలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. స్లాట్ బుకింగ్ ద్వారా వచ్చే అమ్మకపు, కొనుగోలు దారులకు కార్యాలయాల్లో ఏమైనా ఇబ్బందులు కలిగితే జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. స్లాట్ బుకింగ్ లేకుండా రిజిస్ట్రేషన్‌కు వచ్చే ప్రజలకు ఐదు వాక్‌ఇన్ రిజిస్ట్రేషన్లుగా సాయంత్రం 5నుంచి 6గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉన్నందున, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కొడుకు చేతిలో తండ్రి దారుణ హత్య

నవాబుపేట: కొడుకు చేతిలో తండ్రి దారుణ హత్యకు గురైన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. నవాబుపేటకు చెందిన ఎర్కలి బుచ్చయ్య(57) కోడలిపై చేయి చేసుకున్నాడన్న కోపంతో కొడుకు గొడ్డలితో దాడి చేసి హత్య చేసిన చేశాడు. గ్రామస్తుల కథనం మేరకు.. మృతుడు బుచ్చయ్య కుమారుడు ఎర్కలి యాదయ్య జిల్లా కేంద్రంలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తరుణంలో అక్కడే ఒక యువతిని ప్రేమించి ఏడాదిన్నర క్రితం పెళ్లి చేసుకున్నాడు. అనంతరం మండల కేంద్రంలో కుటుంబ సభ్యులతో పాటు నివాసం ఉంటున్నాడు. కాగా మృతుడు తన కోడలును తరుచూ వేధిస్తూ అవమానించేవాడు. సోమవారం సైతం కోడలును తిట్టడంతో పాటు తన కుమారుడు యాదయ్య ముందే చేయి చేసుకున్నాడు. దీంతో కోపంతో రగిలిపోయిన యాదయ్య అక్కడే ఉన్న గొడ్డలితో తండ్రి తలపై బాది హత్య చేశాడు.

పలు కేసుల్లో నిందితుడు..

మృతుడు బుచ్చయ్య(57) పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. మూడు హత్య కేసులు, చోరీ కేసులు తదితర వాటిలో పలుమార్లు జైలుకు సైతం వెళ్లి శిక్ష సైతం అనుభవించాడు. కాగా కొన్ని రోజులుగా మండల కేంద్రంలో ఉంటూ వ్యవసాయం చేసుకొని జీవిస్తున్న తరుణంలో తాజాగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పీయూ కంట్రోలర్‌గా ప్రవీణ


ప్రవీణకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న పీయూ వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ నూతన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా డా.ప్రవీణను నియమిస్తూ వైస్ చాన్స్‌లర్ శ్రీనివాస్ సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమె ఎగ్జామినేషన్ భవనంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా, పీయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్‌గా ప్రవీణ బాధ్యతలు నిర్వహించారు. ఇక్కడ కంట్రోలర్‌గా పనిచేసిన రాజ్‌కుమార్ ఇటీవల బాధ్యతల నుంచి తప్పుకోవడంతో ఆమెను నియమిస్తూ వీసీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అధ్యాపకులు, అధికారులు అభినందనలు తెలిపారు.

కొనసాగుతున్న ఐసీ పరీక్షలు..

పీయూ పరిధిలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ సెమిస్టర్ 8కు సంబంధించిన పరీక్షలు కొనసాగుతున్నాయి. పీయూలో ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. 60మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రవీణ, అడిషనల్ కంట్రోలర్ శాంతిప్రియ, ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి తనిఖీ చేశారు.

15 నుంచి డిగ్రీ పరీక్షలు..

పీయూ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర గ్రూప్స్ విద్యార్థులకు ఈ నెల 15 నుంచి సెమిస్టర్-2, 4, 6 పరీక్షలు నిర్వహించనున్నట్లు పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రవీణ సర్క్యులర్ జారీ చేశారు. ఇందుకు సంబంధించిన టైం టేబుల్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

'పచ్చిరొట్ట'తో ప్రయోజనాలు


పొలాల్లో సాగు చేసిన జనుము

అలంపూర్: నేలల్లో పోషకాలు పెంచి ఆశించిన దిగుబడి సాధించడానికి రైతులు ఎక్కువగా రసాయన ఎరువులపై ఆధారపడుతున్నారు. కానీ రసాయన ఎరువుల వినియోగం తగ్గించి పచ్చిరొట్ట సాగుచేస్తే పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియానాయక్ రైతులకు సూచించారు. గతంలో సాగుభూమిలో పశువుల ఎరువులు ఉపయోగించే వారమని, క్రమంగా పశు పోషణ తగ్గడంతో.. ప్రస్తుతం రైతులు రసాయన ఎరువుల వాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రసాయన ఎరువులు అధికంగా వాడటం ద్వారా నేలల్లో సూక్ష్మ పోషకాలు నశించి, భూములు చౌడు బారి సత్తువ తగ్గిపోతుంది. దీని ప్రభావం పంట దిగుబడులపై పడుతుంది. ఈ పరిస్థితులను అధిగమించడానికి పప్పుజాతికి చెందిన పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లి పెసర, అలసంద, ఉలవ పైర్లను సాగుచేసి నిర్ణీత సమయంలో భూమిలో కలియ దున్నాలన్నారు.

ఉపయోగాలు.. లక్షణాలు

■ పచ్చిరొట్టతో నేల గుల్లబారి భూమికి నీటిని, పోషకాలను నిల్వ చేసుకోనే శక్తినిస్తోంది.

■ పంట వేర్లకు గాలి, నీరు, కావాల్సిన నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి సూక్ష్మపోషకాలు అందుతాయి.

■ నేలలో చౌడు, కలుపు మొక్కల ఉధృతిని తగ్గిస్తుంది.

■ నేల లోపలి పొరల్లో ఉండే పోషకాలు పై పొరల్లోకి వచ్చి పంట దిగుబడి పెరుగుతుంది.

■ పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవులు పెరుగుతాయి. వేరు వ్యవస్థ వృద్ధి చెందుతుంది.

■ నేల కోతను అరికడుతుంది. ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచుతుంది.

■ పచ్చిరొట్ట మొక్కల వేరు బూడిపెల్లో రైజోబియం పెరిగి ఎక్కువ నత్రజని స్థిరీకరిస్తుంది.

యాజమాన్య పద్ధతులు

ఉదయజని ఎక్కువగా ఉన్న నేలల్లో పచ్చిరొట్ట పైరుగా జీలుగ మాత్రమే వేయాలి. జీలుగలో చౌడును హరించే శక్తి ఉంది. ఎర్రనేలల్లో, తేలిక నేలల్లో జనుము, అలసంద, పెసర, నల్లరేగడి నేలల్లో జీలుగ, పిల్లి పెసర వేసుకోవచ్చు. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే నీటి వసతిని పరిగణలోకి తీసుకొని పచ్చిరొట్ట పెంచడం శ్రేయస్కరం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పచ్చిరొట్టను కలియదున్నిన తర్వాత 2 వారాల్లో వరి నాట్లు వేస్తారు. అయితే తేలిక నేలల్లో మురుగు నీరు ఎక్కువగా పారే భూముల్లో వారం రోజుల్లో నాట్లు వేసుకోవచ్చు. మురుగు నీరు పోయే అవకాశం లేని భూముల్లో మూడు వారాలు నాట్లు వేయరాదు. ఎందుకంటే పచ్చిరొట్ట భూమిలో కుళ్లినప్పుడు తయారయ్యే కొన్ని వాయువులు, ఆమ్లాలు అప్పుడే నాటిన వరి మొక్కకు హాని చేస్తాయి.

పచ్చిరొట్ట పంట	ఎకరానికి చల్లాల్సిన విత్తనాలు	తయారయ్యే పచ్చిరొట్ట	లభించే నత్రజని	అనుకులమైన నేలలు
జనుము	16 కిలోలు	10-15 టన్నులు	16-24 కిలోలు	ముంపు నేలలు
జీలుగ	12 కిలోలు	8-10 టన్నులు	30-40 కిలోలు	చౌడు నేలలు
పిల్లి పెసర	8 కిలోలు	4-5 టన్నులు	10-14 కిలోలు	నల్లరేగడి నేలలు
పెసర	14 కిలోలు	4-5 టన్నులు	10-14 కిలోలు	నల్లరేగడి నేలలు
అలసంద	16 కిలోలు	4-6 టన్నులు	16-20 కిలోలు	తేలిక నేలలు

శ్రీశైలంలో నీటిమట్టం 814.1 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయం నీటి మట్టం సోమవారం నాటికి 814.1 అడుగుల వద్ద 36.8198 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శ్రీశైలం కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి జరగలేదు. కాగా శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885.0 అడుగుల వద్ద 215.807 టీఎంసీలు నీటి నిల్వలు ఉంటాయి.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలుశిక్ష


డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చగా సోమవారం న్యాయమూర్తి జైలుశిక్షతో పాటు జరిమానా విధించారు. రెండు రోజుల కిందట వన్‌టౌన్ పోలీసులు చేసిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో ఆనంద్‌చారి, నరేష్ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.నిర్మల ఒక్కొక్కరికి రెండు రోజుల జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అదే విధంగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురిని ట్రాఫిక్ పోలీసులు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఆర్.శశిధర్.. ఒకరికి ఐదు రోజుల జైలుశిక్ష, ఒకరికి రూ.2వేలు, మరో ఇద్దరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ భగవంతురెడ్డి, వన్‌టౌన్ సీఐ అప్పయ్య మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా

కల్వకుర్తి టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జడ్జి జైలుశిక్షతో పాటు జరిమానా విధించనట్లుగా ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని పలు కూడళ్లలో ఆదివారం వాహనాల తనిఖీలు నిర్వహించచారు. అందులో ఇద్దరు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడడంతో వారిని పోలీసులు కల్వకుర్తి జూనియర్ సివిల్ కోర్టులో ప్రవేశపెట్టగా.. జడ్జి కావ్య వారిలో వంగూర్ మండలంలోని ఉల్లంపల్లికి చెందిన నాగార్జున, మున్సిపాలిటీలోని తిమ్మరాశిపల్లికి చెందిన నరేందర్‌కు నాలుగు రోజుల జైలుశిక్షతో పాటుగా, ఒక్కొక్కరికి రూ.100 జరిమానా విధించారు.